PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 18-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 80 Issue: 80

Circulated to Telangana
Published from Jagitial

18 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:12 తిథి సప్తమి మ. 1:02 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం జ్యేష్ఠ రా. 10:38 వరకు తరువాత మూల యోగం ప్రీతి మ. 1:34 వరకు కరణం వనిజ మ. 1:02 వరకు విష్టి రా. 2:13ం వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:21 వరకు రాహుకాలం ఉ. 10:39 నుండి మ. 12:10 వరకు యమగండం మ. 3:11 నుండి సా. 4:41 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు మ. 12:53 నుండి మ. 2:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:34 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

### రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

నిజాంను పొగుడుతూ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని -2 వ పేజీలో...

# నిజాం పాలనలో హైదరాబాద్ అభివృద్ధి

### నాడే భాగ్యనగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు

### చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలతో కల్లోలం

### అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం

### ప్రజాపాలన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



'భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలనలోనే కొనసాగింది. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించింది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచస్థాయి గుర్తింపును అందుకుంది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణిచివేత తీవ్రంగా ఉండేది. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు పోరాటాలకు నాయకత్వం వహించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టారు. ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. అది నిజాం పాలకుల అధికారం ముగిసిన రోజు మాత్రమే కాదు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం 'ప్రజా పాలన దినోత్సవం'గా జరుపుకుంటున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన ప్రజా పాలన దినోత్సవాల్లో ముఖ్యమంత్రి మువ్వన్నెల జెండా ఎగురవేశారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన తరువాయి 2 వ పేజీలో...



## కాటేరమ్మ చిన్నకొడుకు విధ్వంసం

### అభిషేక్ శర్మ వీరవిహారం.. 30 బంతుల్లోనే సెంచరీ

### బౌలింగ్‌లో నితీశ్ నిప్పులు.. చేతులెత్తేసిన అఫ్గనిస్థాన్

### 3-0తో టీ20 సిరీస్ భారత్ క్లీన్‌స్వీప్



## 5 రోజుల పాటు వానలు!

2




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,284 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,558 |

# గోడల పెయింటర్‌వి నీకెక్కడివి ఆస్తులు?

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజం

### మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం

### పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన

### మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా? అని రేవంత్‌కు సవాల్



'గోడల మీద పెయింట్ వేసుకునే నీ సంగతి నాకు తెలియదా.. కొండారెడ్డిపల్లి పోయి అడిగితే మీ బతుకు మొత్తం బయటపడుతుంద'ని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. కేసీఆర్‌కు 1000 ఫాం హౌస్ వద్ద ఎకరాలు ఉందని ఒకసారి, నేడు 67 ఎకరాలని మరోసారి సీఎం చెప్పిన అబద్ధాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో 150 బెడ్ రూంలు ఉన్నాయని.. బంగారు బాత్రూంలు ఉన్నాయని చేసిన చిల్లర వ్యాఖ్యల్లో ఎంత నిజం ఉందో.. నిన్న రేవంత్ చేసిన ఆరోపణల్లో కూడా అంతే నిజం ఉందన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయని మభ్యపెట్టే దాంట్లో ఎంత నిజం ఉందో, రేవంత్ రెడ్డి నిన్న మాట్లాడిన మాటల్లో కూడా అంతే నిజముందని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని -2 వ పేజీలో...



# కేసీఆర్ ఫాంహౌజ్ వద్ద విచారణ షురూ

### రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫాంహౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



అత్యంత ప్రమాదకరమైన మెదడు క్యాన్సర్లలో ఒకటైన గ్లియోబ్లాస్టోమాను ఎలుకల్లో ప్రయోగాత్మక ముక్కు చుక్కల చికిత్సతో విజయవంతంగా నియంత్రించినట్లు పరిశోధకులు తెలిపారు. ప్రత్యేక సూక్ష్మ కణాలను ముక్కు ద్వారా మెదడుకు చేర్చి, క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించారు. ఈ సూక్ష్మ కణాలు రక్త-మెదడు అవరోధాన్ని దాటాల్సిన అవసరం లేకుండా ముక్కు నుంచి మెదడుకు చేరి, రోగనిరోధక కణాలను క్రియాశీలం చేస్తాయి. ఎలుకల్లో మరో రోగనిరోధక చికిత్సతో కలిపి ఉపయోగించినప్పుడు కణితులు తొలగిపోవడంతో పాటు, క్యాన్సర్ తిరిగి రాకుండా దీర్ఘకాలిక రక్షణ కూడా కనిపించింది.

# భారత్ పద్ధతి మార్చుకో

### రష్యా చమురు కొనొద్దు... ట్రంప్ సర్కారు వార్నింగ్



రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ సర్కారు హెచ్చరికలు చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. రష్యా చమురును ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా కొత్త ఆంక్షలతో కూడిన బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

వాషింగ్టన్: అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. 'భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌నుతరువాయి 2 వ పేజీలో...

# మా దేశమే మాకు ముఖ్యం

### మా వాణిజ్య ప్రయోజనాలే ముందు.. అమెరికాకు భారత్ కౌంటర్



భారత్ పద్ధతి మార్చుకోవాలన్న అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టంచేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది.

న్యూఢిల్లీ: ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టంచేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టంవల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తరువాయి 2 వ పేజీలో...



## కుటుంబం నుంచి ఒక్కరు చాలు

### 'సర్' నోటీసులపై ఎన్నికల సంఘం వెసులుబాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఓటర్లకు ఎన్నికల సంఘం గుడ్ న్యూస్ చెప్పింది. 'సర్' ప్రక్రియలో జారీ చేసిన నోటీసుల పరిష్కారానికి కొత్త వెసులుబాటు కల్పించింది. ఓటర్ కుటుంబ - 2 వ పేజీలో...



## జనవరి 22 నుంచి జేఈఈ మెయిన్

### వచ్చే ఏడాది రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ - 2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం తరువాయి 2 వ పేజీలో...

# యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు హత్య

### నేనే చంపేశా: వైష్ణవి సోదరుడు సంతోష్

### నిజామాబాద్‌లో ఘటన.. 9 కత్తి పోట్లు



నిజామాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబును వైష్ణవి సోదరుడు సంతోష్ హత్యచేశాడు. 'నా చెల్లిని చంపినవాడిని నేనే చంపేశా. నా చెల్లికి జరిగినట్టు ఏ ఆడబిడ్డకు జరగకూడదని ఈ పని చేశా'నని సంతోష్ ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఓ వీడియోని రిలీజ్ చేశాడు. వీడియోలో సంతోష్ మాట్లాడుతూ.. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. నా చెల్లిని చంపినందుకే వాడ్ని నేను చంపాను. వాడ్ని చంపాక ఇప్పుడు నాకు భయంతరువాయి 2 వ పేజీలో...

# హిందీ వద్దంటే కుదరదు

### మీ మనస్తత్వం మార్చుకోండి.. తమిళ సర్కారుకు సుప్రీంకోర్టు సూచన

జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. "తమిళనాడు గడ్డపై హిందీ బోధించబోమని చెప్పడం కుదరదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల స్థాపనకు అవసరమైన స్థలాలను గుర్తించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించింది.



న్యూఢిల్లీ: జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ, "మీరు మీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. నవోదయ విద్యాలయాలు కేంద్రం ఇస్తోంది.. -2 వ పేజీలో...

# రాశి ఫలాలు
18.9.2026

**మేషం:** నూతన విద్యవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. గృహ నిర్మాణ ఆటంకాలు తొలగుతాయి. ఆర్థికంగా అభివృద్ధి కలుగుతుంది. ప్రయాణాలు కలసివస్తాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులలో ఆటంకాలు కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆప్తులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగమున కొంత నిరుత్సాహం తప్పదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

**మిధునం:** దీర్ఘకాలిక ఋణాలు కొంతవరకు తీర్చగలరు. ఆరోగ్యపరమైన సమస్యలు చికాకు కలిగిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు శ్రమాధిక్యతతో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యుల సహాయం లభిస్తుంది. ఉద్యోగపరంగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. స్వల్ప ధనప్రాప్తి కలుగుతుంది.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు లాభిస్తాయి. బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన ఉద్యోగ లబ్ది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఉద్యోగ వ్యవహారాలలో తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి పైవారి నుండి ప్రశంసలు పొందుతారు. గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. దూరప్రాంతాల వారి నుండి విలువైన సమాచారాన్ని సేకరిస్తారు. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పెట్టి లాభాలు పొందుతారు.

**కన్య:** సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కలసి వస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో మీరు తీసుకున్న నిర్ణయాల వలన లాభం పొందుతారు. ధనాదాయం బాగుంటుంది. అనారోగ్య సూచనలున్నవి. ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

**తుల:** వృత్తి ఉద్యోగ విషయమై కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. వృత్తి వ్యాపారాలు పరంగా నష్టాల ఊబి నుండి బయటపడతారు. గృహమున బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

**వృశ్చికం:** అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన ఉద్యోగ లాభం కలుగుతుంది. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు విస్తరిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు.

**ధనస్సు:** వ్యాపార పరంగా ఇబ్బందులు తొలగుతాయి. ధన విషయాలలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులతో దూరప్రాంత ప్రయాణాలు చేస్తారు.

**మకరం:** ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు స్వీకరించడం మంచిది. ఋణ బాధలు తొలగుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యల నుండి బయట పడగలుగుతారు.

**కుంభం:** సంతానమునకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి. వాహన కొనుగోలు చేస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సోదరుల సహాయ సహకారాలు పొందుతారు. వ్యాపారం వృద్ధి చెందుతుంది.

**మీనం:** ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. చేతిలో డబ్బు నిల్వ ఉండదు. నేత్ర సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగ విషయమై అనాలోచిత నిర్ణయాలు తీసుకుని ఇబ్బంది పడతారు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. బంధువుల నుండి విమర్శలు ఎదురవుతాయి.

# నిజాం పాలనలో హైదరాబాద్ అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి**

యోధులందరికీ ఆయన ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని చెప్పారు. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని గుర్తుచేశారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందన్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం అని కితాబిచ్చారు. ఆ సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని తెలిపారు. 'సెప్టెంబర్ 17 మనకు గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదు. మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక ఘట్టం. సకల జనుల ఉద్యమం, ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇప్పుడు ఆ చరిత్ర, ఆ ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. అభివృద్ధి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ చేరాలి. చరిత్రను మరిచిపోం. చరిత్ర దగ్గరే ఆగిపోం. ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో... తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం'అని అన్నారు.

**వరంగల్‌లో టిమ్స్**

ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. 'అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను



త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2,000 పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం'అని తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని సీఎం తెలిపారు. 'ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్-నాగపూర్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. ఆర్అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ.6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం'అని సీఎం పేర్కొన్నారు.

# భారత్ పద్ధతి మార్చుకో

**మొదటి పేజీ తరువాయి**

చర్చలవైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు. 'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ) పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. అయితే రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.



## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## కేసీఆర్ ఫాంహౌజ్ వద్ద విచారణ షురూ

**మొదటి పేజీ తరువాయి**

కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.



## 5 రోజుల పాటు వానలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారాయి. రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం (19వ తేదీ) నుంచి వర్షాల తీవ్రత పెరగనుందని తెలిపింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికల ప్రకారం.. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం వరకు ఈదురుగాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు.

## జనవరి 22 నుంచి జేఈఈ మెయిన్

**మొదటి పేజీ తరువాయి**

పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే ఏడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్ - 2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టీఏ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం. జేఈఈ మెయిన్‌తో పాటు మరికొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. దీని ప్రకారం, యూజీసీ నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ - 2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

# యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు హత్య

**మొదటి పేజీ తరువాయి**

వేస్తోంది. నేను బయటికి రావడానికి నన్ను సపోర్ట్ చేయండి. నాకు శిక్ష పడకుండా త్వరగా బయటకి రావడానికి సహాయం చేయండి. నేనే పోలీస్ స్టేషన్‌లో లొంగిపోతున్నాని తెలిపాడు. అనంతరం కోరుట్ల పోలీసుల ఎదుట నిందితుడు సంతోష్ లొంగిపోయాడు. విచారణ నిమిత్తం నిందితున్ని కోరుట్ల పోలీసులు నిజామాబాద్ పోలీసులకు అప్పగించనున్నారు. అంతకుముందు.. నిజామాబాద్‌లోని రాజరాజేంద్ర చౌరస్తా వద్ద కొబ్బరి బొండాలు నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (24), చిథారి హరిబాబు ప్రేమ వివాహం చేసుకున్నారు. వైష్ణవి 'వైషు అమ్మ' పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతూ సోషల్ మీడియాలో గుర్తింపు తెచ్చుకున్నారు. వైష్ణవి నాలుగు నెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఈ ఏడాది మార్చి 17న తన నివాసంలో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నారు. ఆమెను భర్త హరిబాబు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసి పరారయ్యాడు. అదనపు కట్నం కోసం హరిబాబు, అతని కుటుంబ సభ్యులు (తల్లి లక్ష్మి, అన్నలు ఆనంద్, అశోక్) వైష్ణవిని శారీరకంగా, మానసికంగా వేధించారని పోలీసుల విచారణలో తేలింది. ఇదే విషయమై మార్చి 16 రాత్రి వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు హరిబాబును అదే రోజు కోరుట్ల శివారులో అదపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అలాగే వేధింపులకు సంబంధించి అతని కుటుంబ సభ్యులపై కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్యకు గురి కావడం కలకలం రేగింది.

# కుటుంబం నుంచి ఒక్కరు చాలు

**మొదటి పేజీ తరువాయి**

సభ్యుల్లో ఎవరైనా ఒకరు హాజరైతే చాలు. ఫ్యామిలీ మెంబర్‌కు వ్యక్తిగత హాజరుకు అవకాశం ఇచ్చింది. ఈఆర్వో, ఏఈఆర్వోల ఎదుట హాజరై పత్రాలు, సమాచారం అందించే అవకాశం కల్పించింది. కుటుంబ సభ్యుల తరఫున అవసరమైన పత్రాలు సమర్పించవచ్చని.. నోటీసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలంగాణ సీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల పత్రాలు స్వీకరించి నోటీసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. జిల్లా ఎన్నికల అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చిన ఈసీ.. ఓటర్ల నోటీసులను పరిశీలించి పరిష్కరించాలని సూచించింది. ఫారం-6 దరఖాస్తులపై సీఈవో కీలక ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6 దరఖాస్తులకు డిక్లరేషన్ ఫారం తప్పనిసరి. భవిష్యత్‌లో అందే ఫారం-6 దరఖాస్తులకూ డిక్లరేషన్ ఫారం తప్పనిసరి. అర్హత తేదీ 1.10.2026 పరిగణనలోకి తీసుకోవాలి. ఫారం-6 పరిశీలన, డిక్లరేషన్ స్వీకరణ, క్లెయిమ్‌ల పరిష్కారానికి ఆదేశాలిచ్చింది. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా సవరణకు అవకాశం కల్పిస్తూ.. తెలంగాణ సీఈవో సుదర్శన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# హిందీ వద్దంటే కుదరదు

**మొదటి పేజీ తరువాయి**

వీటి వల్ల తమిళనాడు ప్రమాణాలేమీ తగ్గిపోవు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మెలగాలి. ఢిల్లీ ప్రజలు చెన్నై వారిని, అలాగే చెన్నై ప్రజలు ఢిల్లీ వారిని దూరం చేసుకోకూడదు" అని హితవు పలికింది. నవోదయ పాఠశాలల ఏర్పాటు ద్వారా తమిళనాడులో విద్యావకాశాలు మరింత మెరుగుపడతాయని కోర్టు అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే నవోదయ విద్యాలయాలు త్రిభాషా సూత్రాన్ని (హిందీతో సహా) అనుసరిస్తాయి. అయితే, తమిళనాడులో ద్విభాషా విధానం అమలవుతుండటంతో, హిందీని తప్పనిసరి చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది తమ విద్యా విధానానికి విరుద్ధమని వాదిస్తోంది. అంతేకాకుండా, ఇది ఒక ఐచ్ఛిక పథకమని, దీనిని కచ్చితంగా అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించలేదని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలో ఆరు వారాల్లోగా స్థలాలను గుర్తించాలని 2025 డిసెంబర్ 15న సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వం కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. స్థలాల గుర్తింపు కోసం మరో మూడు నెలల గడువు ఇస్తూ, తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. అయితే, తక్షణమే భూసేకరణ చేయాలని తాము చెప్పడం లేదని, కేవలం అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని మాత్రమే ఆదేశిస్తున్నామని కోర్టు స్పష్టం చేసింది. భాషా విధానంపై నెలకొన్న సమస్యలను కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించింది.

# గోడల పెయింటర్‌వి నీకెక్కడివి ఆస్తులు?

**మొదటి పేజీ తరువాయి**

గుర్తు చేశారు. గోడల మీద పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించుకున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి?' అని నిలదీశారు.

బుద్ధి లేదు.. జ్ఞానం లేదు

రేవంత్ రెడ్డి 7 ఏండ్లు డిగ్రీ చదివిండు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొండల్ రావు అని కూకట్‌పల్లిలో ఒక పెద్దాయన ఉంటే ఆయన ఆస్తులు కూడా మా దాంట్లో రేవంత్ రెడ్డి వేసేశాడు. ఆయనకి మాకు చుట్టరికం కూడా లేదు.. కేవలం వెలమ కులం అంతే. కేసీఆర్ అక్కాచెల్లెలు, అన్నతమ్ముళ్ల సంతానం 300 మంది ఉంటారు. వాళ్ల ఆస్తులు కూడా మా ఖాతాలో కలిపెయ్.సంతోష్ రావుకి మాకు చుట్టరికం ఉంటే ఆయన ఆస్తులు కూడా కేసీఆర్ ఖాతాలో వేస్తావా? నీ అన్నతమ్ముళ్ల వాళ్ల పిల్లల ఆస్తులు నీ ఖాతాలో వేస్తే ఎలా ఉంటుంది? అని నిలదీశారు. నవీన్ రావుకి, కొండల్ రావుకి మాకు ఏం సంబంధం? నీకు బుద్ధి జ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు.

నీలా మంది కొంపలు ముంచం 'వ్యవసాయం చేసుకుంటామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. నీలాగా మంది కొంపలు ముంచే పని చేయలేదు. ఆస్తులు గుంజుకోలేదన్నారు. కేసీఆర్ రైతు కాబట్టి బరాబర్ అన్ని చట్టాల ప్రకారం భూమి కొనుక్కున్నాడు. వ్యవసాయం చేశాడన్నారు. కేసీఆర్ భూమిని దేవతలాగా కొలుస్తాడు.. నీ లెక్క మంది కొంపలు ముంచి భూమిని ఆటవస్తువుగా చూడడు' అని కేటీఆర్ పేర్కొన్నాడు. ముఖ్యమంత్రిని సూటిగా ఒక్కటే అగుతున్నా.. నీ కంపు నోటితో కేసీఆర్‌కు 1000 ఎకరాల భూమి ఉందని తప్పుడు కూతలు కూసి, చిల్లర మాటలు మాట్లాడిన అదే నోటితో కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# గణేశ్ నిమజ్జనానికి 20,000 మంది ఖాకీలు

## హైదరాబాద్‌లో పోలీసులు, ఆర్ఏఎఫ్ ఫ్లాగ్ మార్చ్.. నిమజ్జనం రోజు 20,000 మందితో బందోబస్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు, సెప్టెంబర్ 25న జరగనున్న విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో నగర పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి గురువారం నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కవాతు చేపట్టారు. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి మొదలైన ఈ ఫ్లాగ్ మార్చ్.. పటేల్ నగర్, దారుస్సలాం, ఘోడే కీ ఖబర్, జుమ్మేరాత్ బజార్ టీ-జంక్షన్ మీదుగా సాగింది. స్థానిక పోలీసులతో పాటు ఆర్ఏఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. పండుగ సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు, ఊరేగింపులో పాల్గొనేవారు పోలీసుల నిబంధనలు, సూచనలను కచ్చితంగా పాటించాలని గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ తెలిపారు. పోలీసులు సూచించిన మార్గాల్లో, నిర్దేశిత సమయంలోనే ఊరేగింపులు జరపాలని, ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని స్పష్టం చేశారు. గణేశ్ నిమజ్జనం రోజున హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 20,000 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించనున్నారు.







## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## కేటీఆర్ సిబ్బందిపై దాడి.. ఫుటేజ్ భద్రపరచండి

**సైఫాబాద్ పోలీసులకు హైకోర్టు ఆదేశం**



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు. తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

## ఖైరతాబాద్ గణపతికి హరీశ్ పూజలు

ఖైరతాబాద్-హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఖైరతాబాద్ పంచముఖ సంకట మహాగణపతిని బీజేపీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

## లంచగొండులు.. ఆ పోలీసోళ్లు!

**స్టేషన్ బెయిల్ కోసం కీసర సీఐ, ఎస్సై రూ.5 లక్షల లంచం డిమాండ్**

**ఏసీబీ వలకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన పోలీసులు**

మల్కాజిగిరి, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఇద్దరు పోలీసు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, స్వీకరించిన కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్ఓ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు బాధితుడిని, అతని స్నేహితుడిని ఇకపై వేధించకుండా ఉండేందుకు ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తమ ప్రకటనలో వెల్లడించింది. పోలీసుల వేధింపులు ఎక్కువవడంతో బాధితుడు నేరుగా ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా రూ.10 లక్షలు డిమాండ్ చేసిన పోలీసులు, చివరికి రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడితో గత కొన్ని రోజులుగా నిందితులు బిర్యానీలు, కూల్ డ్రింకులు తెప్పించుకుని వేధించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీకి వేళాయే!

**ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ విడుదల**

**డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన**

**మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికలు**




హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

# ఇది 'ఎల్లో'నినో: జగన్



తాడేపల్లి, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## కేసీఆర్ భూములపై విచారణ జరపాలి: మహేశ్ గౌడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ ఆస్తులపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబానికి అంతటి భారీ స్థాయిలో భూములు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బహిర్గతం చేశారని మహేశ్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2009లో కేసీఆర్‌కు ఎలాంటి భూమి లేదని, 2014 నాటికి 35 ఎకరాలు ఉండగా, 2018 నాటికి ఆ విస్తీర్ణం మరింత పెరిగిందని తెలిపారు. 2023 నాటికి కేసీఆర్ పేరిట 53 ఎకరాలు ఉండగా, కేటీఆర్ మరో 67 ఎకరాలు కొనుగోలు చేశారని వివరించారు. మొత్తంగా 2023 నాటికే ఆ కుటుంబం పేరిట 123 ఎకరాలు భూమి ఉందని పేర్కొన్నారు. అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవాలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. భూములకు సంబంధించిన "22ఏ" వివాదంపై కూడా ప్రస్తుతం విచారణ జరుగుతోందని వెల్లడించారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి వారు వాడిన పోలీసుల పట్ల వారి ప్రవర్తనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. వీడియోలను పరిశీలిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉద్దేశపూర్వకంగా దూకుడుగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు.

## ఎస్సై, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్ పీఆర్బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ పోస్టులకు 2026 నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు 2026 డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ , అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## ఆస్ట్రేలియాలో రోడ్డు ప్రమాదం.. విశాఖకు మహిళలు మృతి

వైజాగ్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఏపీలోని విశాఖపట్నానికి చెందిన ఒకే కుటుంబంలోని ఇద్దరు మహిళలు ఆస్ట్రేలియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మెల్బోర్న్ నగరంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన విశాఖలో తీవ్ర విషాదఛాయలు నింపింది. విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ) మాజీ సంయుక్త కార్యదర్శి జీటీ ప్రసాద్ ఇటీవల తన భార్యతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లారు. అక్కడ జరుగుతున్న ఒక కుటుంబ వేడుకలో పాల్గొనేందుకు వారు మెల్బోర్న్ చేరుకున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో జీటీ ప్రసాద్ భార్యతో పాటు ఆయన కోడలు నేహా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. అత్యంత విషాదకరమైన విషయమేమిటంటే, ఈ ప్రమాదం జీటీ ప్రసాద్ కళ్లెదుటే జరిగింది. ఈ ఘటనతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేడుక కోసం ఎంతో ఆనందంగా వెళ్లిన ఆ కుటుంబంలో ఈ ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. మృతదేహాలను స్వస్థలానికి తరలించే ప్రక్రియ కొనసాగుతోందని, సుమారు 10 రోజుల్లో అవి విశాఖకు చేరుకుంటాయని బంధువులు వెల్లడించారు.

## వారం పాటు పోలీసు కస్టడీకి రావణ్

గన్నవరం, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): సోషల్ మీడియా వేదికగా విద్వేషపూరిత వ్యాఖ్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ రావణ్ కేసులో గన్నవరం న్యాయస్థానం ఈరోజు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఈ కేసు విచారణలో భాగంగా జోసెఫ్‌ను ఏడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు రేపు (సెప్టెంబరు 18) ఉదయం గన్నవరం పోలీసులు అతడిని కస్టడీకి తీసుకోనున్నారు. యువతను రెచ్చగొట్టేలా వీడియోలు రూపొందించడం, ఏలూరులో నిర్వహించిన ఓ సమావేశంలో నక్సలిజం వైపు మళ్లేలా ప్రసంగాలు చేశారనే ఆరోపణలపై ఏపీ పోలీసులు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ఉన్న సంబంధాలు, దీని వెనుక లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి

లోవెల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఓ హైదరాబాదీ యువకుడు అక్కడ ఆకస్మికంగా మృతి చెందాడు. నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ జాబేర్ హుస్సేన్ (27), అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం లోవెల్ నగరంలో ఈ నెల 14న మృతి చెందాడు. జాబేర్ 2021లో సివిల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లాడు. కనెక్టికట్‌లో చదువు పూర్తి చేసి లోవెల్‌లో ఉద్యోగంలో చేరాడు. గత నెల ఆగస్టులోనే టెక్సాస్‌లో ఆయనకు వివాహం జరిగింది. సెప్టెంబర్ 14న ఉదయం తన తల్లితో ఫోన్‌లో మాట్లాడినప్పుడు జాబేర్ ఆరోగ్యంగానే ఉన్నాడని ఆయన తండ్రి జాకీర్ తెలిపారు. అయితే, అదే రోజు సాయంత్రం జాబేర్ నిద్రలోనే మరణించినట్లు ఆయన భార్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జాబేర్ మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఆయన కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో వారు మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) అధికార ప్రతినిధి అమ్జెద్ ఉల్లా ఖాన్‌ను ఆశ్రయించారు. ఆయన ఈ విషయంపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, వీలైతే అయ్యే ఖర్చులను భరించాలని కోరారు. మరోవైపు, హైదరాబాద్ ఎంపీ సైతం ఈ విషయంపై స్పందించి, న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్‌కు లేఖ రాశారు. జాబేర్ అంత్యక్రియల కోసం మృతదేహాన్ని హైదరాబాద్‌కు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, జాబేర్ మృతికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

## డీజేలను అడ్డుకోవద్దు: లోకేశ్

విజయవాడ, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించి డీజే వాహనాల అనుమతులపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఉత్సవాల సందర్భంగా డీజే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని ఆయన హోంమంత్రి అనిత, డీజీపీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని లోకేశ్ తెలిపారు. ప్రజల నుంచి ఈ విషయంపై తనకు అనేక సందేశాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, డీజీపీ వెంటనే జోక్యం చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డీజే వాహనాలకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సులభతరం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా క్లియరెన్సులు ఇవ్వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా రాష్ట్రంలో ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని ఆయన స్పష్టంగా సూచించారు. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగను జరుపుకునే వాతావరణం కల్పించాలని ఆయన పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.



## భీమన్నకు 3.72 కోట్ల ఆదాయం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసానికి సంబంధించిన 28 రోజుల హుండీ లెక్కింపు పూర్తయింది. రెండు రోజుల పాటు నిర్వహించిన లెక్కింపులో మొత్తం రూ.3,72,78,809 నగదు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మొదటి రోజు రూ.1,91,64,681, రెండో రోజు రూ.1,81,14,128 నగదు లభించింది. అలాగే మొత్తం 201 గ్రాముల 400 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 16 కిలోల 600 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ కార్యాలయ పరిశీలకుడు రాజమౌళి, ఆలయ డీఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎస్పీఎఫ్, హోంగార్డులు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.




## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారి కల్యాణ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా విమోచన వేడుకలు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): వేములవాడ రూరల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందని తెలిపారు. నిజాం పాలనలో ప్రజలు అణచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. విమోచన కోసం పోరాడిన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో ఎదురుగట్ల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కడారి సంధ్య తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, సుంకరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న సన్నిధిలో చంద్రబోస్ ప్రత్యేక పూజలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): ప్రముఖ తెలుగు సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనకండ్ల సుభాష్ చంద్రబోస్ కుటుంబ సమేతంగా వేములవాడ శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇటీవల వివాహమైన తన కుమారుడు, కోడలితో కలిసి వచ్చిన చంద్రబోస్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడె మొక్కు చెల్లించడంతో పాటు అభిషేకం, నిత్యకల్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రమాదేవి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేసి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ వేములవాడ రాజరాజేశ్వరస్వామి తమ కుటుంబ ఇలవేల్పు, కులదైవమని తెలిపారు. చిన్నతనంలో తల్లిదండ్రులతో కలిసి ఆలయానికి వచ్చేవాడినని, కుమారుడి వివాహం అనంతరం కుటుంబంతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది దర్శనానికి సహకరించారని తెలిపారు. సినీ రంగంలో తన ప్రస్థానానికి 31 ఏళ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు సుమారు 890 సినిమాలకు 3,800కు పైగా పాటలు రాసినట్లు చంద్రబోస్ తెలిపారు. వేములవాడ రాజన్న చరిత్ర, క్షేత్ర విశిష్టతను ప్రతిబింబించేలా త్వరలో భక్తిగీతం రచిస్తానని చెప్పారు.

# అభివృద్ధి అజెండాగా ప్రజాపాలన

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి.. ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజును పురస్కరించుకుని ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వం జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి సంస్థకు ఇప్పటివరకు రూ.390 కోట్లు మంజూరయ్యాయని, మూలవాగు వంతెన నుంచి రాజన్న ఆలయం వరకు రూ.47.86 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులు తుది దశలో ఉన్నాయని చెప్పారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి రూ.111.25 కోట్లతో పనులు జరుగుతున్నాయని, అదనంగా రూ.99.40 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గుడిచెరువు బండ్ పార్కును రూ.12 కోట్లతో అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని, గుడిచెరువులో బోటింగ్‌కు రూ.1.40 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నాంపెల్లి గుట్టపై భారత వైమానిక దళం సహకారంతో విమాన నమూనా ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, రాజన్న ఆలయ గోశాల కోసం మర్రిపెల్లిలో 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు చెప్పారు. భీమేశ్వరస్వామి ఆలయంలో రూ.6 కోట్లతో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన వారందరికీ అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, పుల్కం రాజు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఆర్డీవోలు



శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అటు.. సంకేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలన అందించడమే ప్రజాపాలన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అందరి భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్, జీపీఓ లక్ష్మి, ఉపసర్పంచ్ పండుగ శంకరయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ విమోచనం సమైక్యతకు ప్రతీక

**ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 17 (పీఐబీ): తెలంగాణలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విమోచనం స్వతంత్ర భారత చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, ఆపరేషన్ పోలో అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత సమాఖ్యలో విలీనమైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ వేడుక ఒక చారిత్రక తేదీని గుర్తుచేసుకోవడానికే పరిమితం కాదని, దేశ సమైక్యత, భారత ప్రగతి ప్రస్థానానికి సంబంధించిన విలువలను గుర్తుచేసుకునే సందర్భమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయని, హైదరాబాద్ చరిత్ర వాటిని ప్రతిబింబిస్తుందని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ క్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. విభజన అనంతరం తొలి



హోంశాఖ మంత్రిగా, సంస్థానాల శాఖ మంత్రిగా ఆయన దేశ ఏకీకరణకు కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని, సంస్థానాల ఏకీకరణలో సర్దార్ పటేల్ విశేష కృషి చేశారని, ప్రస్తుతం 'వికసిత భారత్--2047' దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. హైదరాబాద్ విమోచన నేపథ్యంలో జరిగిన ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలు, రైతులు, సామాన్య ప్రజలు పాల్గొన్నారని గుర్తుచేశారు. అనేకమంది జైలు శిక్షలు, హింస, వ్యక్తిగత కష్టనష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. రామ్‌జీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి పోరాట యోధులకు నివాళులు అర్పించారు. చరిత్ర ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రముఖ నాయకుల చర్యలతో మాత్రమే రూపుదిద్దుకోదని, అన్యాయాన్ని అంగీకరించకుండా పోరాడిన సామాన్యుల ధైర్యసాహసాలు కూడా చరిత్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

# పీఎం జ్ఞాపికల ఈ-వేలం ప్రారంభం

## 1,498 జ్ఞాపికల విక్రయానికి ఏర్పాట్లు.. నమామి గంగేకు ఆదాయం

న్యూఢిల్లీ: పీఎం జ్ఞాపికల ఈ-వేలం 8వ ఎడిషన్‌ను కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ గురువారం ప్రారంభించారు. సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఈ-వేలం వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 17 నుంచి అధికారిక పోర్టల్ ద్వారా ఈ-వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈసారి మొత్తం 1,498 జ్ఞాపికలను వేలానికి ఉంచినట్లు మంత్రి చెప్పారు. వీటిలో దేశంలోని వివిధ ప్రాంతాల కళలు, సంప్రదాయ హస్తకళలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, క్రీడా విజయాలను ప్రతిబింబించే వస్తువులు ఉన్నాయని తెలిపారు. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, అస్సాం, బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జ్ఞాపికలు ఉన్నాయని వివరించారు. ఈ ఎడిషన్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన 50 కీలక వస్తువులు ఉన్నాయని మంత్రి తెలిపారు. కర్ణాటకకు చెందిన శ్రీరాముడి వెండి జ్ఞాపికకు రూ.13.50 లక్షలు, కాకతీయ కళాతోరణం వెండి ప్రతిమకు రూ.9 లక్షలు, 'ట్రీ ఆఫ్ లైఫ్' గోండ్ కళాచిత్రానికి రూ.7.50 లక్షలు, జగన్నాథ పరివార్ రథానికి రూ.6



లక్షలు, 99.99 శాతం స్వచ్ఛత కలిగిన బంగారు పూత ఫ్రేమ్ రాధాకృష్ణ కళాఖండానికి రూ.5.40 లక్షల కనీస ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గత ఎడిషన్ల మాదిరిగానే ఈసారి కూడా పౌరులు, సేకరణదారులు, సంస్థలు, కళాభిమానులు పాల్గొనేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ-వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని 'నమామి గంగే' కార్యక్రమానికి కేటాయించనున్నట్లు గజేంద్ర షెకావత్ వెల్లడించారు. దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు, గంగా నది పునరుజ్జీవనానికి మధ్య అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ-వేలం నిర్వహణ, జ్ఞాపికల ప్రదర్శన, సమాచార సేకరణను న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ పర్యవేక్షిస్తోంది. సాంకేతిక సహకారాన్ని ఎన్ఐసీ, చెల్లింపు వ్యవస్థకు ఎస్‌బీఐ, మూల్యాంకనానికి సంబంధిత అధికారులు, వస్తువుల ప్యాకింగ్, పంపిణీకి నిర్దేశిత సంస్థలు సహకరిస్తున్నాయి. వేలానికి ముందు జ్ఞాపికలను వీక్షించి వాటి కళాత్మక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు.

# విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన

**కోరుట్ల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీహబ్, టీవర్క్స్ సందర్శన**



మెట్‌పల్లి, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): మెట్‌పల్లి-కోరుట్ల డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక టీ-హబ్, టీ-వర్క్స్‌ను సందర్శించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో ఆధునిక సాంకేతికత, స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు. టీ-హబ్‌లో స్టార్టప్‌లకు అందిస్తున్న మెంటరింగ్, మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం, వ్యాపారాభివృద్ధి అంశాలను తెలుసుకున్నారు. టీ-వర్క్స్‌లో అత్యాధునిక పరికరాలు, ప్రోటోటైపింగ్, డిజైన్, ఉత్పత్తుల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన అవసరమన్నారు. యువత తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మార్చి భవిష్యత్‌లో ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. పర్యటన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు పేర్కొంటూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## అద్దెదారుడు చనిపోతే ఇంటి యజమాని మానవత్వం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): అద్దెకు ఉంటున్న వ్యక్తి మృతిచెందడంతో ఇంటి యజమాని మానవత్వంతో స్పందించి, మృతదేహాన్ని తన ఇంట్లోనే ఉంచుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు అంత్యక్రియల ఏర్పాట్లకు సహకరించారు. చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన బత్తుల రామస్వామి కొంతకాలంగా వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్యంనగర్ విశాల షాపింగ్ మాల్ ప్రాంతంలో బీజేపీ సీనియర్ నాయకుడు కనికరపు రాజయ్య ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం రామస్వామి గుండెపోటుతో మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈ సమయంలో మృతదేహాన్ని ఇంట్లో ఉంచేందుకు అవకాశం కల్పించడంతో పాటు అంత్యక్రియల ఏర్పాట్లలోనూ రాజయ్య కుటుంబానికి అండగా నిలిచారు. కష్టకాలంలో మానవత్వం చాటుకున్న రాజయ్యను స్థానికులు అభినందించారు.



## బీజేపీ ఫ్లెక్సీల ధ్వంసం.. కమలనాథుల రాస్తారోకో

మల్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చింపివేసి, అనంతరం దహనం చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఘటనకు బాధ్యులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, మల్యాల మండల కేంద్రంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి, ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొనుగంటి గౌతం కుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు, మల్యాలలో గురువారం ప్రజాపాలన వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ బొట్ల జయ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్టు

మల్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): రైతుల పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్లు చోరీ చేస్తున్న ముఠాను మల్యాల పోలీసులు అరెస్టు చేశారు. 9 కేసుల్లో 10 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 39 కిలోల కాపర్ వైర్ చోరీ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల, వెల్గటూర్, ధర్మపురి, గొల్లపల్లి, బుగ్గారం మండలాల్లో గ్రామ శివార్లలోని పొలాలను నిందితులు లక్ష్యంగా చేసుకున్నారు. రాత్రివేళ రైతులు, ఇతరులు లేని సమయంలో ప్రత్యేక పరికరాలతో ట్రాన్స్‌ఫార్మర్లను తెరిచి కాపర్ వైర్లను తీసుకెళ్లేవారు. అనంతరం వాటిని ఆటోలో తరలించి విక్రయించేవారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మల్యాల గ్రామానికి చెందిన తపాలా బాబు (ఏ1), మంచిర్యాల వడ్డెర కాలనీకి చెందిన కోట శ్రీను అలియాస్ గండికోట శ్రీను, పల్లపు సురేష్, సూర సురేష్‌లను నిందితులుగా గుర్తించారు. వీరిలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 39 కిలోల కాపర్ వైర్, ప్యాసింజర్ ఆటో, మొబైల్‌ఫోన్, ట్రాన్స్‌ఫార్మర్లు తెరిచేందుకు వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఏ1 తపాలా బాబు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై సందీప్‌కుమార్, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

# టాటా చైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు ఐదేళ్ల పొడిగింపు!

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడేలా కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీకాలం ఇవ్వడంతో పాటు కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు ప్రతిపాదనలను టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు ఎన్‌డీటీవీ ప్రాఫిట్ కథనం పేర్కొంది. టాటా ట్రస్ట్స్ తరఫున బోర్డులో నోయెల్ టాటాకు వీటో హక్కు ఉంది. చంద్రశేఖరన్ కొనసాగింపుతో పాటు లిస్టింగ్ ప్రతిపాదనపై ఆయన అసమ్మతి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఇతర బోర్డు సభ్యుల మద్దతుతో ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు కథనం తెలిపింది. టాటా సన్స్ లిస్టింగ్ అంశం కొంతకాలంగా పెండింగ్‌లో ఉంది. ఆర్‌బీఐ తాజాగా కంపెనీ లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. 2022లో టాటా సన్స్‌ను 'అప్పర్ లేయర్' ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సిన నిబంధన ఏర్పడింది. చంద్రశేఖరన్ 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022లో ఆయనకు రెండోసారి ఐదేళ్ల పదవీకాలం లభించింది. అది 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే మరోసారి బాధ్యతలు చేపట్టబోనని ఆయన ఈ ఏడాది ఆగస్టులో బోర్డుకు తెలియజేశారు.






### చంద్రశేఖరన్ పునర్నియామకం చట్టవిరుద్ధం: టాటా ట్రస్ట్స్

టాటా గ్రూప్‌లో నాయకత్వ మార్పు వ్యవహారం కీలక మలుపు తిరిగింది. టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకం కోసం బోర్డు చేసిన తీర్మానాన్ని టాటా ట్రస్ట్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ తీర్మానం చట్టపరంగా చెల్లదని స్పష్టం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనితో టాటా సన్స్ బోర్డుకు, మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్‌కు మధ్య ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియనుంది. ఈ నేపథ్యంలో, తాను మళ్లీ చైర్మన్ పదవికి పోటీపడనని ఆగస్టు 12న చంద్రశేఖరన్ స్వయంగా బోర్డుకు తెలియజేశారు. ఆయన నిర్ణయాన్ని ఆమోదించిన టాటా ట్రస్ట్స్, కొత్త చైర్మన్‌ను ఎంపిక చేయడానికి సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేయాలని మరుసటి రోజే టాటా సన్స్‌కు సూచించింది. అయితే, గురువారం జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్‌ను తిరిగి నియమించాలంటూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నలుగురు డైరెక్టర్లు దీనికి అనుకూలంగా ఓటు వేయగా, ట్రస్ట్ నామినీ డైరెక్టర్ అయిన నోయెల్ టాటా ఈ ప్రతిపాదనను వీటో హక్కుతో వ్యతిరేకించారు. కంపెనీ నిబంధనల (ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్) ప్రకారం, చైర్మన్ నియామకానికి లేదా పునర్నియామకానికి ట్రస్ట్ నామినీ డైరెక్టర్లందరి మద్దతు తప్పనిసరి. నోయెల్ టాటా వ్యతిరేకంగా ఓటు వేసినందున ఈ తీర్మానానికి చట్టబద్ధత లేదని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఈ వాదనకు మద్దతుగా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.వై. చంద్రచూడ్ ఇచ్చిన న్యాయసలహాను కూడా నోయెల్ టాటా బోర్డు ముందు ఉంచారు. అయితే, బోర్డు దానిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. నాయకత్వ మార్పు ప్రణాళిక ప్రకారమే జరగాలని, తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని టాటా ట్రస్ట్స్ స్పష్టం చేసింది.

## అస్తిత్వ పోరాటానికి ప్రతీక తెలంగాణ: నందయ్య

జగిత్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ కేవలం భౌగోళిక ప్రాంతం కాదని, అస్తిత్వ పోరాటానికి ప్రతీకగా నిలిచిందని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అన్నారు. పీసీసీ పిలుపు మేరకు తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948 సెప్టెంబరు 17న తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన రోజని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు అనేక ఉద్యమాలు చరిత్రలో నిలిచిపోయాయని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన వీరయోధులకు నివాళులర్పించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌సీపీఎస్‌ఈయూ బీర్పూర్ నూతన కార్యవర్గం ఎన్నిక




బీర్పూర్, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ బీర్పూర్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీర్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నికలకు పరిశీలకులుగా చుక్క కిరణ్, సందుపట్ల రమేష్ వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా మెరుగు విఘ్నేశ్, ప్రధాన కార్యదర్శిగా మర్సుకోల ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎం.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తాంద్ర సుధాకర్, మహిళా అధ్యక్షురాలిగా బి.రాణి, ఉపాధ్యక్షులుగా కాయితి ఇమాన్యుయల్, కె.మల్లికార్జున్, సహాయ కార్యదర్శులుగా ఎండీ.ముజక్కీర్ పాషా, బి.సుధాకర్ ఎన్నికయ్యారు. సీపీఎస్ రద్దు పోరాటంలో ఉద్యోగుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## గిరిజన రిజర్వేషన్లు పెంచింది కేసీఆర్‌దే: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): గిరిజనులకు రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్ దేనని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మేడారం తండా, ధర్మానాయక్ తండాలో గిరిజనుల రిజర్వేషన్‌ను 6 నుంచి 10 శాతానికి పెంచిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి గిరిజనులు క్షీరాభిషేకం చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై సేవాలాల్, మేరమ్మ యాడి ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను గిరిజనులకు కల్పించేందుకు కేసీఆర్ జనాభా ప్రాతిపదికన 2017 సెప్టెంబర్ 17న రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచారని, సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి ఉన్నా కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేశారన్నారు. రిజర్వేషన్ పెంపుతో విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో గిరిజనులకు లబ్ధి చేకూరిందని, ఏటా 1100 మంది వైద్య వృత్తిలోకి వచ్చే అవకాశం కలిగిందని, ప్రతి నియోజకవర్గంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 92 గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి గిరిజనులకు రాజకీయ బలం ఇచ్చారని, కాంగ్రెస్ పాలనలో మూడేళ్లలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని, విద్యుత్ కోతలు, యూరియాపై యాప్ ఆంక్షలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. అన్నారం-సుందిళ్ల నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఎన్డీఎస్ఏ చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోయాలి లేదా క్రాప్ హాలిడే ప్రకటించి ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేష్ మాట్లాడుతూ ఉద్యమంలో తండాలు తిరిగి గిరిజనుల బాధలు తెలుసుకున్న కేసీఆర్ తండాలను పంచాయతీలుగా మార్చి ఆత్మగౌరవం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు భారతి, సంతోష్, నాయకులు ఆకుల రమేష్, భాస్కర్ నాయక్, తేలు రాజు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబ ప్రగతి లక్ష్యం: అజాహారుద్దీన్

జగిత్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): అన్ని రంగాల్లో జగిత్యాల జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, ప్రతి కుటుంబం ప్రగతి సాధించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజాహారుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య భారతదేశంలో అంతర్భాగమైన చారిత్రక రోజని అన్నారు. నాటి తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాలు, స్వాభిమాన ఆకాంక్షలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం, ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి చేర్చడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్-2047' దార్శనిక పత్రంతో రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగిత్యాల జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆదర్శంగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, బి.రాజగౌడ్, డీఆర్వో కె.వై.ప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి: దుమాల



జగిత్యాల, సెప్టెంబర్ 17 (ఈవార్తలు): అంబేద్కర్ ఆశయాలను అవమానించేలా వ్యవహరించిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల డీసీసీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు, 16వ వార్డు కౌన్సిలర్ దుమాల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో 'కల్పిత నాయకులు అంబేద్కర్' పేరుతో పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు ప్రచారం జరుగుతోందని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మోదీ పుట్టిన రోజున ఢిల్లీ సీఎం రక్తదానం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా వినూత్న సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారు. ఆమె స్వయంగా రక్తదానం చేయడంతో పాటు, తన అవయవాలను దానం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాకుండా, గిగ్ వర్కర్ల కోసం ఒక ప్రత్యేక సేవా కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. వివరాల్లోకి వెళితే, త్యాగరాజ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో సీఎం రేఖా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రక్తదానం చేశారు. అనంతరం, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతో సహా తన 14 అవయవాలను దానం చేయడానికి అంగీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచి, దానిని ప్రోత్సహించేందుకు స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా రూపొందించిన అవయవదాన పోర్టల్‌ను ఆమె ప్రారంభించారు.

## 1000 కోట్లిచ్చినా స్కూల్ మూత

### జుకర్‌బర్గ్ భార్య స్కూల్ క్లోజ్




ఈస్ట్ పాలో ఆల్టో: ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ భార్య ప్రిసిల్లా చాన్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ది ప్రైమరీ స్కూల్' మూతపడింది. గత పదేళ్ల కాలంలో దాదాపు 125 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1,000 కోట్లకు పైగా) పైగా నిధులను వెచ్చించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఈ ఏడాది జూన్‌లో పాఠశాల కార్యకలాపాలను నిలిపివేశారు. కాలిఫోర్నియాలోని ఈస్ట్ పాలో ఆల్టోలో 2016లో ఈ పాఠశాల ప్రారంభమైంది. దీనికి ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న 'చాన్ జుకర్‌బర్గ్ ఇనిషియేటివ్' (సీజెడ్‌ఐ), 2025-26 విద్యా సంవత్సరం తర్వాత నిధులను సమకూర్చలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, పాఠశాల బోర్డు గతేడాది ఏప్రిల్‌లోనే సంస్థను మూసివేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. తమ సంస్థ ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాల కంటే శాస్త్రీయ పరిశోధనలపైనే అధికంగా దృష్టి సారిస్తోందని సీజెడ్‌ఐ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. అల్పాదాయ కుటుంబాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు వైద్య పరీక్షలు, మానసిక ఆరోగ్యం వంటి సమగ్ర సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రైవేట్ పాఠశాలను స్థాపించారు. అయితే, విద్యా ప్రమాణాల పరంగా ఈ పాఠశాల పనితీరు సగటు కంటే తక్కువగా నమోదైంది. దీనికి తోడు, తరచూ ప్రిన్సిపాల్స్ మారడం వంటి అంతర్గత సమస్యలు కూడా పాఠశాల పురోగతికి ఆటంకంగా మారాయి. పాఠశాల మూసివేత ప్రకటన వెలువడే నాటికి రెండు క్యాంపస్‌లలో కలిపి సుమారు 540 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ నిర్ణయం తమను తీవ్ర నిరాశకు గురిచేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, బాధితులైన విద్యార్థులకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సీజెడ్‌ఐ 50 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది.

## ఎండీఆర్‌పై మినహాయింపునివ్వండి: పెట్రోల్ డీలర్లు



న్యూఢిల్లీ: పెట్రోల్ బంకుల్లో ఇంధనం అమ్మకాలపై యూపీఐ ద్వారా చేసే చెల్లింపులకు వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై 'ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్' (ఏఐపీడీఏ) ప్రతినిధులు గురువారం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు. కొత్త యూపీఐ నిబంధనల ప్రకారం, పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ.2,000 దాటిన ప్రతి లావాదేవీపై రూ.5 ఎండీఆర్ ఛార్జీ విధిస్తున్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో జరిగే మొత్తం కొనుగోళ్లలో సుమారు 30 నుంచి 40 శాతం లావాదేవీలు ఈ పరిధిలోకి వస్తాయని డీలర్లు చెబుతున్నారు. పెట్రోల్ అమ్మకాలు నిర్దేశిత కమీషన్లపై ఆధారపడి జరుగుతాయని, ఈ అదనపు ఎండీఆర్ ఛార్జీల భారం తమ మార్జిన్లను దెబ్బతీస్తుందని డీలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ అధికారులు ఎండీఆర్ విధింపు వెనుక ఉన్న కారణాలను వివరించారు. దేశంలో యూపీఐ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు ఈ ఛార్జీలు అవసరమని వారు తెలిపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంలో తాము ముందు వరుసలో ఉన్నామని, ప్రభుత్వంతో కలిసి పనిచేశామని ఏఐపీడీఏ గుర్తుచేసింది. ఎండీఆర్ అనేది ప్రభుత్వం గానీ, ఎన్‌పీసీఐ గానీ వసూలు చేసే పన్ను కాదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు ఈ మొత్తాన్ని బ్యాంకులకు, పేమెంట్ అప్లికేషన్ ప్రొవైడర్లకు పంచుతారని తెలిపింది. ఇంధనం, రైల్వేలు, టెలికాం, బీమా, వ్యవసాయం వంటి తక్కువ మార్జిన్లు ఉండే కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఈ రూ.5 ఫ్లాట్ ఛార్జీని వర్తింపజేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని, వినియోగదారులు, డీలర్లు, యూపీఐ భాగస్వాములు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని ఏఐపీడీఏ ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఫెడ్ ఎఫెక్ట్‌తో సూచీలకు ఒడిదుడుకులు



ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 21.86 పాయింట్లు నష్టపోయి 74,314.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 53 పాయింట్లు లాభపడి 23,270.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 23,300 స్థాయి వద్ద కీలక నిరోధాన్ని ఎదుర్కొంటోందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఈ స్థాయిని దాటితే 23,500 వరకు నిఫ్టీ పుంజుకునే అవకాశం ఉందన్నారు. 23,200 నుంచి 23,000 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చని పేర్కొన్నారు. కొన్ని బడా కంపెనీల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు నిఫ్టీలో భారీగా లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లు మాత్రం బెంచ్‌మార్క్ సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.92 శాతం పెరిగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.76 శాతం లాభపడింది. రియల్టీ, ఆటో, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. మరోవైపు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు నష్టపోయాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం ప్రభావాన్ని ఇన్వెస్టర్లు అంచనా వేయడంతో మార్కెట్లు ఒక పరిమిత శ్రేణిలో కదిలాయని నిపుణులు తెలిపారు. అదే సమయంలో వివిధ రంగాల షేర్లలో కదలికలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేశాయని చెప్పారు. మరోవైపు అమెరికా ఫెడ్ నిర్ణయం తర్వాత రూపాయి మరింత ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేశారు. డాలర్‌తో రూపాయి విలువ 96 స్థాయిని దాటే అవకాశం ఉందన్నారు. డాలర్-రూపాయి మారకంలో 96.25 వద్ద తక్షణ నిరోధం ఉందని, 95.40-95.75 మధ్య మద్దతు లభించవచ్చని విశ్లేషించారు.

## గణేశ్ వేడుకల్లో ట్రంప్ కూతురు

### అంబానీ ఇంట్లో ఉత్సవాలకు హాజరు

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె టిఫనీ అరియానా ట్రంప్, ముంబైలో నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ నివాసంలో జరిగిన ఈ ఉత్సవాలకు ఆమె హాజరై సందడి చేశారు. ముఖ్యంగా ఈ వేడుకల్లో టిఫనీ భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ కార్యక్రమం అనంతరం టిఫనీ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వేడుకలకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. ఆ ఫొటోలకు 'లవ్ ఇండియా' అనే క్యాప్షన్‌ను జత చేయడం విశేషం. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. టిఫనీ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ రెండో భార్య మార్లా మాపుల్స్ కుమార్తె. గతంలోనూ పలువురు అంతర్జాతీయ ప్రముఖులు అంబానీ కుటుంబం నిర్వహించే వేడుకలకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో టిఫనీ కూడా చేరారు.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 18-9-2026, జగిత్యాల | www.evarthalu.com


వయ్యారి చిత్రం



తేజస్వి మదివాడ

## గర్వంగా.. గౌరవంగా: రష్మిక



అమృత గాత్రంతో దశాబ్దాల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్‌ను ఉర్రూతలూగించిన సంగీత సామ్రాజ్ఞి, గాయని భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత చరిత్రను సినిమాగా రూపొందిస్తున్నారు విజనరీ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేష్, బన్నీ వాస్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఎంఎస్ సుబ్బులక్ష్మిగా నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ చేతుల మీదుగా గ్రాండ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా రష్మిక మందన్న మాట్లాడుతూ.. 'నటిగా నాకు ఈ గొప్ప అవకాశం దక్కినందుకు కృతజ్ఞతతో మనసు నిండిపోతోంది. ఎంఎస్ అమ్మ 110వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఈ వేదిక మీద నిల్చున్నందుకు దేవుడి సమక్షంలో ఉన్న భావన కలుగుతోంది. అమ్మ జీవిత ప్రయాణంలో చిన్న భాగంగా మారుతున్నందుకు ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నా. మీ ఆశీర్వాదం ఎప్పుడూ మాపై ఉంటుందని నమ్ముతున్నాం. ఎంఎస్ అమ్మ పాత్రను మీ అందరికీ నచ్చేలా పోషించేందుకు సంపూర్ణ ప్రయత్నం చేస్తాను' అని పేర్కొంది.

## నా త్రండ్రి ప్రోత్సాహం మరువలేనిది: జేసన్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ వారసుడు జేసన్ సంజయ్ సినీ పరిశ్రమలోకి దర్శకుడిగా అడుగుపెడుతున్నాడు. టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ద్విభాషా చిత్రం 'సిగ్మా' ద్వారా అతడు మెగాఫోన్ పట్టాడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రత్యేక మీడియా సమావేశం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ... విదేశాల్లో స్క్రీన్ రైటింగ్, డైరెక్షన్ కోర్సులు పూర్తి చేసి సినిమా నిర్మాణంలోని 24 క్రాఫ్ట్స్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకున్నట్లు వెల్లడించాడు. తన సినీ ప్రయాణంలో తండ్రి విజయ్ ప్రోత్సాహం మరువలేనిదని, 'మైఖేల్' సినిమాలో సందీప్ కిషన్ అభినయం బాగా నచ్చడంతోనే ఈ కథకు ఆయనను ఎంపిక చేసుకున్నానని చెప్పాడు. ఈ తొలి చిత్రాన్ని వెండితెరపై వీక్షించేందుకు తన తండ్రి ఎంతో ఆత్రుతగా నిరీక్షిస్తున్నారని జేసన్ హర్షం వ్యక్తం చేశాడు.



## చిరంజీవికి జోడీగా స్నేహ..?

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు.

## లక్ష జడల అమ్ముడయ్యాయి




నేచురల్ స్టార్ నాని తన తదుపరి చిత్రం 'ప్యారడైజ్' ప్రమోషన్‌లలో భాగంగా పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలోని 'ఆయా షేర్' పాట విడుదలైన తర్వాత తన హెయిర్‌స్టైల్‌కు విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఆ పాట చూసిన తర్వాత ఆన్‌లైన్‌లో ఏకంగా లక్షకు పైగా కృత్రిమ జడలు అమ్ముడయ్యాయని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమా కోసం తాను శారీరకంగా ఎంతో శ్రమించానని, సిక్స్ ప్యాక్ సాధించడంతో పాటు జడలతో కూడిన విభిన్నమైన ఆహార్యంలో కనిపిస్తానని వివరించారు. 'ప్యారడైజ్' కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదని, ఇందులో హృదయాన్ని హత్తుకునే బలమైన తల్లి-కొడుకు సెంటిమెంట్ కూడా ఉందని నాని స్పష్టం చేశారు. ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్ బాబు ఒక అద్భుతమైన పాత్రను పోషించారని ఆయన ప్రశంసించారు.

## 'రాకా'.. '37' పోస్టర్



గత కొన్ని నెలలుగా సైలెంట్‌గా షూటింగ్ జరుపుకుంటున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'రాకా' నుండి ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజింగ్ అప్డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి అప్డేట్స్ రావడం లేదని నిన్నటి వరకు ఫీలయ్యారు ఫ్యాన్స్.. దీంతో నేడు ఓ నెంబర్ పోస్టర్ వదలి.. దాన్ని ఎనలైజ్ చేయమని ఫ్యాన్స్‌కే పరీక్ష పెట్టారు టీమ్. 'మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి' అనే ట్యాగ్ లైన్‌తో తాజాగా కేవలం '37' అనే సంఖ్య మాత్రమే ఉన్న ఒక విలక్షణమైన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మిస్టరీ నంబర్ పోస్టర్ ఇప్పుడు అల్లు అర్జున్ అభిమానులతో పాటు సినిమా లవర్స్‌ను సైతం ఆకర్షిస్తుంది. అసలు ఆ '37' కి అర్థం ఏంటా అని నెటిజన్లు జుట్టు పీక్కుంటున్నారు.

## పోస్ట్ ప్రొడక్షన్‌కు 'రణబాలి'



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. మొత్తం 130 రోజుల పాటు భారీ ఎత్తున, హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో ఈ సినిమా చిత్రీకరణ జరిపారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ మొత్తం కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్‌లోకి అడుగుపెట్టినట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన ఫొటోలను టీమ్ పంచుకుంటూ 'అవును, అవును, మీ మాట మాకు వినిపిస్తోంది.. సరైన సమయం వచ్చినప్పుడు, ఆ ఆశ్చర్యం కోసం వేచి చూసిన ప్రతి క్షణం సార్థకమవుతుంది' అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ జత చేశారు. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న వివాహం తర్వాత కలిసి నటిస్తున్న సినిమా కావడంతో 'రణబాలి'పై ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా.. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది. త్వరలో "రణబాలి" సినిమా నుంచి ఫస్ట్ సింగిల్.. 'ఏందయ్యా సామీ..' ఫుల్ సాంగ్ రిలీజ్ చేసేందుకు టీమ్ సన్నాహాలు చేస్తున్నారు. కాగా.. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'రణబాలి' అక్టోబర్ 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



## మనకు మనమే శత్రువులం

సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

## ఇంటిమేట్ సీన్స్‌కు యోగా బాల్



కెమెరాల ముందు ఇంటిమేట్ సీన్స్ ఎలా చేస్తారు అని ప్రేక్షకుల్లో డౌట్స్ వస్తుంటాయి. అయితే.. ఈ ఇంటిమేట్ సీన్లను వాస్తవానికి ఎలా చిత్రీకరిస్తారనే ఆసక్తికరమైన విషయాన్ని బయట పెట్టింది హాలీవుడ్ నటి సారా షాహి. ఆమె ప్రధాన పాత్రలో నటించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'సెక్స్/లైఫ్' లో బోల్డ్ సీన్లలో నటించడంపై మాట్లాడుతూ.. అలాంటి బోల్డ్ సీన్స్‌లో నటీనటులు సౌకర్యంగా ఉండటానికి ఉపయోగించే ఒక వినూత్న ట్రిక్ గురించి తెలిపింది. 'ఇంటిమేట్ సన్నివేశాలను చిత్రీకరించే సమయంలో ఇద్దరు నటీనటుల మధ్య గాలి తీసేసిన ఒక చిన్న యోగా బాల్‌ను ఉంచుతారు. ఎదుటి నటుడు సీన్ చేస్తున్నప్పుడు, అతను వాస్తవానికి ఆ యోగా బాల్‌ను మాత్రమే టచ్ చేస్తాడు. ఆ సమయంలో నేను కేవలం ఆ బాల్ తాలూకు స్పర్శను (ఇంపాక్ట్‌ను) మాత్రమే అనుభవిస్తాను తప్ప, ఆ నటుడిని కాదు. ఈ పద్ధతి వల్ల మనకు ఇష్టం లేని శారీరక స్పర్శలను అనుభవించాల్సిన అవసరం ఉండదు.



# మెస్సీ మెరిశాడు!

ఇటీవలే అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికిన లియోనల్ మెస్సీ మరోసారి మెరిశాడు. ఇంటర్ మియామి క్లబ్ తరఫున వందో గోల్ కొట్టాడీ వెంటరన్. బుధవారం జరిగిన కాంపెయోన్స్ కప్ ఫైనల్లో మెస్సీ గోల్‌తో క్రుజ్ అజుల్‌పై 2-0తో ఇంటర్ మియామి జయభేరి మోగించింది. తమ జట్టుకు ట్రోఫీ అందించిన ఈ సాకర్ మాంత్రికుడు వ్యక్తిగతంగా 49వ ట్రోఫీని సాధించాడు. మైదానంలోకి దిగాడంటే గోల్స్‌తో రెచ్చిపోయే లియోనల్ మెస్సీ ఈసారి ఫైనల్లో చెలరేగాడు. క్యాంపెయోన్స్ కప్ టైటిల్ పోరులు క్రుజ్ అజుల్‌పై 24వ నిమిషంలో మెస్సీ సూపర్‌గా గోల్ చేశాడు. లూయిస్ సూరెజ్ అందించిన పాస్‌ను అంతే అద్భుతంగా తలతో బంతిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఇంటర్ మియామి తరఫున మెస్సీకి ఇది వందో గోల్ కావడం విశేషం. పీఎస్‌జీ(పారిస్ సెయింట్ జర్మనీ) నుంచి 2023లో ఈ క్లబ్‌కు మారిన ఈ సాకర్ దిగ్గజం.. 115వ మ్యాచ్‌లో సెంచరీ గోల్ సాధించాడు. మొత్తంగా అతడు వచ్చాక మియామి నాలుగు ట్రోఫీలు గెలుపొందింది. కెరీర్ పరంగా వరల్డ్‌కప్, క్లబ్స్ తరఫున గెలిచిన టైటిళ్లతో కలిపి 49వ ట్రోఫీతో మెస్సీ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. తండ్రి మరణంతో కొన్ని రోజులు ఆటకు బ్రేకిచ్చి.. మళ్లీ మైదానంలో అడుగుపెట్టిన ఈ వెటరన్ ప్లేయర్ మునపటిలా గోల్స్‌తో అభిమానులను అలరిస్తున్నాడు.

## అథ్లెటిక్స్ కోచ్ రాకేశ్‌పై లైఫ్ బ్యాన్

### పవర్‌లిఫ్టర్ సస్పెన్షన్

న్యూఢిల్లీ: జాతీయ యాంటీ డోపింగ్ ఏజెన్సీ తాజాగా విడుదల చేసిన తాజా శిక్షల జాబితాలో అథ్లెటిక్స్ కోచ్ రాకేష్ కుమార్‌పై జీవితకాల నిషేధం విధించింది. నిషేధిత ఉత్ప్రేరకాలను అథ్లెట్లకు అందించినట్లుగా రుజువుకావడంతో ఆయనపై కఠిన చర్యలు తీసుకున్నారు. మరోవైపు పవర్‌లిఫ్టర్ గౌరవ్ వత్స్‌ను నిషేధిత డ్రగ్స్ కలిగి ఉండటం, అక్రమ రవాణా ఆరోపణలపై తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. అథ్లెట్లకు నిషేధిత పదార్థాలను సప్లయ్ చేసినట్లుగా తేలడంతో కోచ్ రాకేష్ కుమార్‌పై 'నాడా' జీవితకాల నిషేధం విధించింది. గత ఏడాది మార్చిలోనే ఆయన సస్పెన్షన్‌కు గురికాగా, ఆ తేదీ నుంచే ఈ నిషేధం వర్తించనుంది. పవర్‌లిఫ్టర్ గౌరవ్ వత్స్‌కు చెందిన న్యూట్రిషనల్ సప్లిమెంట్స్ కంపెనీ కేంద్రంగా డోపింగ్ నిరోధక దాడులు జరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో నాడా ఇంటెలిజెన్స్ అండ్ ఇన్వెస్టిగేషన్స్ విభాగం ఇచ్చిన సమాచారంతో ఢిల్లీలోని నజాఫ్‌గఢ్‌లో ఉన్న ఆయన కంపెనీలో జరిపిన సోదాల్లో భారీ ఎత్తున అనబాలిక్ స్టెరాయిడ్స్, 28,00 క్యాప్సూల్స్, హార్మోన్ ఇంజెక్షన్లను రెడ్‌హ్యాండెడ్‌గా సీజ్ చేశారు. ఇక నేషనల్ ఇంటర్-స్టేట్ బ్రాంజ్ మెడల్ విజేత, స్ప్రింటర్ ప్రకృతి రూప రావు స్టానోజోలోల్, డ్రోస్టానోలోన్ వంటి నిషేధిత స్టెరాయిడ్స్ వాడినట్లుగా తేలడంతో తాత్కాలిక సస్పెన్షన్‌కు గురయ్యారు. ఖేలో ఇండియా గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ వెయిట్‌లిఫ్టర్ చెల్సికి డోప్ టెస్ట్ విఫలం కావడంతో ఐదేళ్ల పాటు నిషేధం విధించారు. అయితే, మొత్తంగా అథ్లెటిక్స్ విభాగం నుంచి ఏడుగురి పేర్లు ఈ తాత్కాలిక సస్పెన్షన్ జాబితాలో చేరడం క్రీడా వర్గాల్లో సంచలనంగా మారింది.



## పృథ్వీ షా, ఆకృతి ఎంగేజ్‌మెంట్ బ్రేక్

టీమిండియా క్రికెటర్ పృథ్వీ షా వ్యక్తిగత జీవితంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాబోయే భార్య ఆకృతి అగర్వాల్‌తో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆరు నెలల క్రితమే వీరి నిశ్చితార్థం జరిగింది. సోషల్ మీడియా ద్వారా ఆకృతి గురువారం ఈ విషయం వెల్లడించారు. తమ భవిష్యత్తు లక్ష్యాలు, పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయని గుర్తించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆకృతి తెలిపారు. ఇద్దరి అంగీకారంతోనే విడిపోవాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి ఊహాగానాలు చేయొద్దని, తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని ఆమె కోరారు. "మా భవిష్యత్తు లక్ష్యాలు, పరిస్థితులు వేర్వేరుగా ఉండటంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ఒకరిపై ఒకరికి ప్రేమ, గౌరవం ఉన్నప్పటికీ.. మా దారులు కలిసి సాగవని అంగీకరించాం. ప్రస్తుత పరిస్థితులు, బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని విడివిడిగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం" అని ఆకృతి ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 8న పృథ్వీ షా, ఆకృతి అగర్వాల్ తమ ఎంగేజ్‌మెంట్‌ను ప్రకటించాడు. ఈ సందర్భంగా పృథ్వీ షా పలు రొమాంటిక్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఓ ఫొటోలో మోకాళ్లపై కూర్చుని ఆకృతికి ప్రపోజ్ చేస్తున్నట్లు కనిపించాడు.



# కాటేరమ్మ చిన్నకొడుకు విధ్వంసం



## అభిషేక్ శర్మ వీరవిహారం.. 30 బంతుల్లోనే సెంచరీ

### బౌలింగ్‌లో నితీశ్ నిప్పులు.. 3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్

**టీమిండియా యువ సంచలనం అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఈ యువ బ్యాటర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.**

కేవలం 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగంగా శతకం బాదిన భారత ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఆఫ్ఘన్ బౌలర్లపై సిక్సర్ల వర్షం కురిపిస్తూ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అభిమానులకు కనుల పండుగ చేశాడు. సెంచరీ బాదిన తర్వాత ధ్యానముద్రలో కూర్చుని అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ బౌలింగ్ ఎంచుకోగా, భారత్ ఇన్నింగ్స్‌ను సంజూ శాంసన్‌తో కలిసి అభిషేక్ శర్మ ప్రారంభించాడు. క్రీజులోకి వచ్చాక మొదటి బంతి నుంచే బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న అభిషేక్, ఆఫ్ఘన్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ముఖ్యంగా ఫజల్‌హక్ ఫరూఖీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన ఓవర్లలో సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 100 పరుగులు చేసిందంటే అభిషేక్ విధ్వంసం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచశ్రేణి బౌలర్ రషీద్ ఖాన్‌ను సైతం వదలకుండా సిక్సర్లు బాదాడు. అబ్దుల్లా అహ్మద్‌జాయ్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో సింగిల్ తీసి, కేవలం 30 బంతుల్లోనే తన మూడో టీ20 సెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో, 2017లో శ్రీలంకపై రోహిత్ శర్మ నెలకొల్పిన 35 బంతుల సెంచరీ రికార్డు బద్దలైంది. టెస్టు హోదా ఉన్న దేశాల్లో ఇదే అత్యంత వేగవంతమైన టీ20 సెంచరీ కావడం విశేషం. న్యూజిలాండ్ ఆటగాడు ఫిన్ అలెన్ కోల్ కతాలో దక్షిణాఫ్రికాపై సాధించిన 33 బంతుల్లో 100 పరుగుల రికార్డు అభిషేక్ దెబ్బకు తెరమరుగైంది. అభిషేక్ శర్మ (108) శతక సునామీకి తోడు చివర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (29) కూడా రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. 222 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా, తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి బంతితో నిప్పులు చెరిగాడు. కీలక సమయంలో 4 ఓవర్లలో కేవలం 25 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. అతనికి రవి బిష్ణోయ్ (3 వికెట్లు), అక్షర్ పటేల్ (2 వికెట్లు) కూడా తోడవడంతో ఆఫ్ఘన్ జట్టు 14.1 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది.

## రికార్డులు.. అభి'షేక్'

అభిషేక్ శర్మ, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న తొమ్మిదేళ్ల రికార్డును బద్దలుకొట్టాడు. 2017లో శ్రీలంకపై రోహిత్ శర్మ 35 బంతుల్లో సెంచరీ సాధించగా, ఇప్పుడు అభిషేక్ కేవలం 30 బంతుల్లోనే ఆ మైలురాయిని దాటి భారత్ తరఫున అత్యంత వేగవంతమైన టీ20 సెంచరీని తన పేరిట లిఖించుకున్నాడు. కేవలం 34 బంతులు ఎదుర్కొని 11 భారీ సిక్సర్లతో 108 పరుగుల వద్ద అభిషేక్ ఔటయ్యాడు.

### ఒకే ఇన్నింగ్స్‌తో బద్దలైన రికార్డులు ఇవే:

1. భారత్ తరఫున ఫాస్టెస్ట్ టీ20 సెంచరీ: కేవలం 30 బంతుల్లో శతకం పూర్తి చేసి, రోహిత్ శర్మ (35 బంతులు) రికార్డును అధిగమించాడు.

2. ఐసీసీ ఫుల్ మెంబర్ దేశం తరఫున ఫాస్టెస్ట్ సెంచరీ: ఐసీసీలోపూర్తి సభ్యత్వం ఉన్న దేశాల ఆటగాళ్లలో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును నెలకొల్పాడు. గతంలో జింబాబ్వేకు చెందిన సికిందర్ రజా, న్యూజిలాండ్‌కు చెందిన ఫిన్ అలెన్ (33 బంతులు) పేరిట ఈ రికార్డు ఉండేది.

3. ఐసీసీ ఫుల్ మెంబర్ దేశంపై ఫాస్టెస్ట్ సెంచరీ: ఐసీసీలో పూర్తి సభ్యత్వం ఉన్న జట్టుపై అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఆటగాడిగా కూడా నిలిచాడు. గతంలో 2026 టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఫిన్ అలెన్ 33 బంతుల్లో సెంచరీ చేశాడు.

4. పవర్‌ప్లేలో అత్యధిక పరుగులు: టీ20 మ్యాచ్‌లో తొలి ఆరు ఓవర్ల (పవర్‌ప్లే)లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అభిషేక్ కేవలం 22 బంతుల్లో 76 పరుగులు సాధించాడు. గతంలో పోర్చుగల్‌కు చెందిన కుల్దీప్ ఘోలియా (74) పేరిట ఈ రికార్డు ఉండేది.

5. 20 బంతుల లోపు అత్యధిక హాఫ్ సెంచరీలు: ఈ మ్యాచ్‌లో 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. టీ20ల్లో 20 బంతుల లోపు అర్ధశతకం సాధించడం అభిషేక్‌కు ఇది ఆరోసారి కావడం విశేషం. ఇది కూడా ఒక రికార్డే.

6. భారత్ తరఫున అత్యధిక టీ20 సెంచరీలు: ఈ సెంచరీతో టీ20 క్రికెట్‌లో అభిషేక్ శర్మ మొత్తం 10 శతకాలు పూర్తి చేసుకున్నాడు. తద్వారా, ఈ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డును సమం చేశాడు. మరో సెంచరీ చేస్తే కోహ్లీని అధిగమిస్తాడు.

7. ఒక సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు: ఈ సిరీస్‌లో మొత్తం 22 సిక్సర్లు బాదిన అభిషేక్, ఒక టీ20 సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత ఆటగాడిగా తన రికార్డునే సమం చేసుకున్నాడు. 2025లో ఇంగ్లండ్‌పై కూడా 22 సిక్సర్లు కొట్టాడు.



## హర్మన్‌ప్రీతే బెస్ట్ కెప్టెన్

భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ మార్పుపై చర్చ జరుగుతున్న తరుణంలో, మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గట్టి మద్దతు తెలిపింది. ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో రాణించకపోయినా, జట్టును నడిపించడానికి ఆమెనే సరైన వ్యక్తి అని స్పష్టం చేసింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన టీ20 ఆసియా కప్‌ను భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి గెలుచుకుంది. అయితే, ఈ టోర్నీలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5 మ్యాచ్‌ల్లో కేవలం 71 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచింది. దీనికి తోడు ఆమె వయసు 37 ఏళ్లు కావడంతో, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు కెప్టెన్సీ అప్పగించాలనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాట్లాడిన అంజుమ్ చోప్రా, కెప్టెన్సీ మార్పుపై వస్తున్న చర్చలను తోసిపుచ్చింది. "ప్రస్తుతానికి భారత జట్టును నడిపించడానికి హర్మన్‌ప్రీతే ఉత్తమ కెప్టెన్. ఆమె బ్యాటింగ్ ప్రదర్శనపై విమర్శలు వస్తున్నాయి. కానీ, ప్రతిసారీ ఆమె నుంచి 2017 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన 171 పరుగుల వంటి ఇన్నింగ్స్‌ను ఆశించలేం" అని పేర్కొంది. రాబోయే ఆసియన్ గేమ్స్, ఇతర సిరీస్‌లతో హర్మన్‌ప్రీత్ తిరిగి ఫామ్‌లోకి వస్తుందని అంజుమ్ చోప్రా ధీమా వ్యక్తం చేసింది. "ముఖ్యమైన టోర్నమెంట్ల నాటికి బ్యాట్‌తో రాణించడం ఎంత ముఖ్యమో ఆమెకు తెలుసు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు భారత జట్టుకు ఇంకా ఎంతో అవసరం" అని వివరించింది.

## అగార్కర్‌కు గుడ్‌బై?



భారత సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ నెలతో ముగియనున్నట్లు తెలుస్తోంది. ఆయనకు పొడిగింపు ఇవ్వకపోవచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అగార్కర్ స్థానంలో మాజీ క్రికెటర్లు పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓజా పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అగార్కర్ పదవీకాలాన్ని వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందన్న వార్తలు గతంలో వచ్చాయి. అయితే బీసీసీఐలోని ఓ వర్గం మాత్రం ఆయనకు పొడిగింపు దాదాపు ఉండదనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో అగార్కర్‌కు పొడిగింపు దక్కే అవకాశం తక్కువగా ఉందని సమాచారం. బుధవారం జరిగిన సెలెక్షన్ సమావేశమే అగార్కర్ ఛైర్మన్‌గా చివరి సమావేశం కావచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆ సమావేశంలోనే వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లకు భారత జట్లను ఎంపిక చేశారు. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును కూడా అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీనే ఎంపిక చేసింది. అగార్కర్ స్థానంలో పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓజా పేర్లు ముందంజలో ఉన్నట్లు సమాచారం.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 18-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

## కాంగ్రెస్‌కు మళ్లీ కష్టమే!

రాజకీయాల్లో అధికార పక్షాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షం బాధ్యత. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని పరిశీలించడం, తప్పులను ఎత్తిచూపడం, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడం ప్రజాస్వామ్యానికి అవసరం. కానీ ఒక దశ దాటిన తర్వాత ప్రభుత్వ వ్యతిరేకతే రాజకీయ విధానంగా మారితే? అధికారంలో ఉన్న పార్టీ ఏం చెబితే దానికి విరుద్ధంగా మాట్లాడటమే ప్రతిపక్ష వ్యూహంగా కనిపిస్తే? అప్పుడు అసలు ప్రశ్నలు ప్రజల నుంచి రావడం సహజం. కాంగ్రెస్ విషయంలోనూ ఇదే చర్చ పదేపదే తెరపైకి వస్తోంది. హిందీ విషయంలో దేశంలోని భాషా వైవిధ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందనడం ఒక విధానం. కానీ హిందీని వ్యతిరేకించడం, ఒక భాషను మరొక భాషకు ప్రత్యర్థిగా నిలబెట్టడం వేర్వేరు విషయాలు. భారతదేశం అనేక భాషల సమ్మేళనం. ఒక భాషను ప్రోత్సహించడాన్ని మరో భాషపై ఆధిపత్యంగా ప్రజలు భావించకుండా సమతుల్య విధానం అవసరం. సీఏఏ విషయంలోనూ కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే సీఏఏలోని కొన్ని నిబంధనలను తొలగిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీనికి రాజ్యాంగ విలువలు, మతనిరపేక్షత, సమానత్వం వంటి అంశాలను కారణాలుగా కాంగ్రెస్ వివరిస్తోంది. మరోవైపు, బీజేపీ దీనిని జాతీయ భద్రత, శరణార్థుల రక్షణ, పౌరసత్వ విధానంతో ముడిపెడుతోంది. కాంగ్రెస్ ముందున్న అసలు రాజకీయ సవాలు ఇక్కడే ఉంది. బీజేపీని వ్యతిరేకించడమే తన ప్రధాన గుర్తింపుగా ప్రజలకు కనిపిస్తే, ఆ పార్టీకి ప్రత్యామ్నాయ పాలనా దృష్టిని వివరించడం కష్టమవుతుంది. 'బీజేపీ తప్పు కాబట్టి కాంగ్రెస్ సరైనదే' అనే రాజకీయ సమీకరణ ఎప్పటికీ పనిచేయదు. ప్రజలు ఇప్పుడు 'బీజేపీని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?' అనే ప్రశ్నతో పాటు 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తుంది?' అని కూడా అడుగుతున్నారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ధరలు, రైతుల ఆదాయం, మహిళల భద్రత, యువత భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సమాఖ్య వ్యవస్థ, జాతీయ భద్రత.. ఇలాంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రజల ముందుంచడం ప్రతిపక్షానికి అత్యవసరం. కేవలం అధికార పార్టీ నిర్ణయాలకు ప్రతిస్పందించడం కాకుండా, ప్రజల సమస్యలకు ముందుగానే పరిష్కారాలను ప్రతిపాదించాలి. ప్రజలు బీజేపీని తిరస్కరించాలా, కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలా అన్నది రాజకీయ పార్టీలు నిర్ణయించేది కాదు. ఓటర్లు తమ అనుభవం, సమస్యలు, విధానాలపై అవగాహన, నాయకత్వంపై నమ్మకం ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అందుకే కాంగ్రెస్ ముందున్న సవాలు 'బీజేపీకి వ్యతిరేకంగా ఉ ఒడటం' కాదు; 'బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎందుకు ఉండాలి?' అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం. రాజకీయాల్లో శాశ్వత వ్యతిరేకత కంటే శాశ్వతమైనది ప్రజల సమస్యలు. బీజేపీ ఏం చెప్పినా వ్యతిరేకించడమే రాజకీయమైతే అది చివరకు పార్టీకి భారమవుతుంది. ప్రజలు పార్టీ పేరును మాత్రమే చూడరు. తమ జీవితాల్లో మార్పు తీసుకురాగల విధానాన్ని, విశ్వసనీయమైన నాయకత్వాన్ని, అమలు చేయగల ప్రత్యామ్నాయాన్ని చూస్తారు. కాంగ్రెస్ ఆ ప్రత్యామ్నాయాన్ని స్పష్టంగా ప్రజల ముందు ఉ ఒచగలుగుతుందా? అన్నదే అసలు ప్రశ్న.

# విస్తృత ఆలోచనా శక్తి.. మోదీ

**భారత్‌లో తొలి గ్రీన్‌ఫీల్డ్ నగరాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యం ఎప్పటికైనా సాకారమవుతుందా అనే ఆశను నేను కోల్పోతున్న సమయం అది. అప్పట్లో నేను ఢిల్లీ-ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా ఉన్నాను. భారత్ పారిశ్రామిక పట్టణీకరణలో తదుపరి దశకు ఊతమిచ్చే బాధ్యత నాపై ఉంది. ఇలాంటి ప్రాజెక్టుకు 150 చదరపు కిలోమీటర్ల భూమిని కేటాయించడం చాలా ప్రమాదకరం, సంక్లిష్టమంటూ ప్రతి ముఖ్యమంత్రి మా ప్రతిపాదనను తిరస్కరించారు. ఆ తర్వాత నేను గుజరాత్ సీఎం కార్యాలయానికి వెళ్లాను. నరేంద్ర మోదీ నేను చెప్పినదంతా విన్నారు. ఐదు నిమిషాలు ఆలోచించి, '150 చదరపు కిలోమీటర్లు చాలా తక్కువ' అన్నారు. 'కలలు కనాలనుకుంటే... పెద్ద కలలే కనండి' అని ఆయన నాతో చెప్పారు.**



**అమితాబ్ కాంత్**

ముఖ్యమంత్రి మోదీ 750 చదరపు కిలోమీటర్లు కేటాయించేందుకు ముందుకొచ్చారు. 2009 నాటికి గుజరాత్ ప్రభుత్వం ప్రత్యేక పెట్టుబడి ప్రాంతం చట్టాన్ని తీసుకొచ్చి, మాస్టర్ ప్లాన్‌తో పాటు ధోలేరా 'సర్'ను అధికారికంగా ప్రకటించింది. ఆ తొలి సంభాషణ ఆయన ఆలోచనల విస్తృతిని నాకు తెలియజేసింది. ఆయన ఆలోచన పరిధి చాలా పెద్దది. భూమిని ఆయన ఒక పరిమితిగా చూడలేదు. ఒక ప్రాజెక్టును విడిగా చేపట్టే కార్యక్రమంగానూ భావించలేదు. గుజరాత్‌కు, కాలక్రమంలో భారత్‌కు కొత్త వృద్ధి చోదక శక్తిని నిర్మించే అవకాశాన్ని ఆయన అందులో చూశారు. నా వృత్తి జీవితంలో నేను కలిసిన అత్యంత ముందుచూపు కలిగిన దార్శనిక నాయకుల్లో ఆయన ఒకరు. అప్పుడూ అలాగే ఉన్నారు, ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నారు.

2014 నాటికి కేంద్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మోదీ సీఎం స్థాయి నుంచి భారత ప్రధాని బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం కార్యదర్శిగా ఉన్న నేను ఆయనకు ప్రజెంటేషన్ ఇచ్చిన తొలి అధికారుల్లో ఒకడిని. ప్రపంచ బ్యాంకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగ్స్‌లో భారత్ 142వ స్థానంలో ఉండటం చూసి ఆయన నిరాశ చెందారు. దేశ పౌరులు, వ్యాపార సంస్థలకు భారత్‌లో కార్యకలాపాలను మరింత సులభంగా, సరళంగా, సమర్థంగా మార్చాలనే ఏకైక లక్ష్యంపై దృష్టి పెట్టాలని మమ్మల్ని కోరారు. ఆ విధంగా వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో కఠోర కృషి మొదలైంది. దివాలా, దివాలా పరిష్కార స్మృతి, వస్తు సేవల పన్నుపై పనిచేశాం. కాలం చెల్లిన నిబంధనలు, నియంత్రణలు, విధానాలు, చట్టాలను తొలగించేందుకు కృషి చేశాం. వివిధ విభాగాల ఆలోచన ధోరణిని మార్చడం కష్టంగా ఉండేది. అయినా ప్రయత్నం కొనసాగించాం. చివరకు విజయం సాధించాం. ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి నుంచి ఈ ప్రయత్నానికి నిరంతరం దిశానిర్దేశం చేయడమే దీనికి కారణం. చివరకు భారత్ ర్యాంకింగ్స్‌లో 79 స్థానాలు పైకి ఎగబాకింది. ఆ తర్వాత కొద్దికాలానికే 'మేక్ ఇన్ ఇండియా'పై ప్రధానమంత్రికి అనేక ప్రజెంటేషన్లు ఇచ్చాం. భారత్ తయారీ రంగ దేశంగా ఎదగాలంటే ఉద్యోగాలు సృష్టించాలి, సుసంపన్నతకు ఊతమివ్వాలి, అధిక వృద్ధిని స్థిరంగా కొనసాగించాలనే విషయంలో ఆయనకు స్పష్టత ఉంది. ఆ నమ్మకం నుంచే 'మేక్ ఇన్ ఇండియా' ప్రారంభమైంది. నేడు ఆ దార్శనికత భారీ స్థాయి తయారీ సామర్థ్యంగా విస్తరించింది. మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్స్ నుంచి ఆటోమొబైల్స్, విద్యుత్ వాహనాలు, ఔషధాలు, రక్షణ పరికరాలు, సోలార్ మాడ్యూల్స్, టెలికమ్యూనికేషన్స్, ఇంజినీరింగ్ వస్తువుల వరకు అనేక రంగాల్లో తయారీ సామర్థ్యం విస్తరించింది. భారత యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే విషయంలోనూ ఆయన అంతే పట్టుదలతో ఉన్నారు.

చాలామంది భారతీయులకు ఈ వ్యవస్థాపక దార్శనికత సాకారం కావడానికి డిజిటల్ చెల్లింపుల ప్రపంచంలో భారత్ చేపట్టిన అపూర్వ ముందడుగు దోహదపడింది. దశాబ్దం క్రితం రోజువారీ లావాదేవీల్లో నగదు, సంక్లిష్టమైన కార్డులదే ఆధిపత్యం. డిజిటల్ నగదు బదిలీలు నెమ్మదిగా, ఖరీదైనవిగా ఉండేవి. చిన్న వ్యాపారులు, తొలిసారి స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తున్న చాలామందికి అవి అందుబాటులో ఉండేవి కావు. ఉద్దేశపూర్వకంగా మొత్తం వ్యవస్థను భాగస్వామ్యం చేస్తూ చేపట్టిన సమష్టి ప్రయత్నమే ఈ పరిస్థితిని మార్చింది. తక్కువ నగదు వినియోగించే ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రధానమంత్రి ముందుకు నడిపించారు. భారతీయ రిజర్వు బ్యాంకు నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ను రూపొందించి అమల్లోకి తీసుకొచ్చింది. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, టెలికం కంపెనీలు, వ్యాపారులు కలిసి అందరికీ అందుబాటులో ఉండే పరస్పర అనుసంధాన చెల్లింపుల వ్యవస్థను నిర్మించారు. 100 రోజుల్లో 100 డిజిటల్ మేళాలు నిర్వహించాలని ఆయన మా బృందానికి సవాలు విసిరారు. ఆ భారీ ప్రయత్నం యూపీఐ అసాధారణ వృద్ధికి అవసరమైన వేగాన్ని అందించింది. 2016-17లో కేవలం 1.78 కోట్లుగా ఉన్న యూపీఐ లావాదేవీలు ఇప్పుడు ఏడాదికి 24,000 కోట్లకు పైగా చేరాయి. లావాదేవీల సంఖ్య 13,000 రెట్లకు పైగా, వాటి విలువ 4,000 రెట్లు పెరిగింది. సాధారణ పరిస్థితుల్లో 50 ఏళ్లు పట్టే పురోగతిని భారత్ ఏడేళ్లలో సాధించింది. 2016 నాటికి దేశ అత్యున్నత విధాన రూపకల్పన సంస్థ నీతి ఆయోగ్‌కు నాయకత్వం వహించే బాధ్యత నాకు లభించింది.

ఆయనతో కలిసి పనిచేసిన సమయంలో నేను నేర్చుకున్న గొప్ప పాఠాల్లో ఒకటి దేశ మౌలిక సదుపాయాల రంగాలపై ఆయన నిర్వహించిన సమీక్షల నుంచి వచ్చింది. నీతి ఆయోగ్ ఎప్పుడూ పూర్తి సన్నద్ధతతో ఉండాలని, వివిధ మంత్రిత్వ శాఖల పనితీరును పరిశీలించి, సమగ్ర ప్రజెంటేషన్లు ఇవ్వాలని ఆశించేవారు. ప్రధానమంత్రి ఎప్పుడూ శ్రద్ధగా వినేవారు. సమాచారాన్ని ఆకళింపు చేసుకుని, ఆ తర్వాత అనేక అడుగులు ముందుకు వేసి ఆలోచించేవారు. ఆయన ప్రశ్నలు సమస్య మూలాన్ని నేరుగా తాకేవి. ఒక ప్రాజెక్టు ఎందుకు నిలిచిపోయింది? దానికి ఎవరు బాధ్యులు? తక్షణమే ఏం చేయవచ్చు? ఇదే సమస్య మరోచోట లేదా భవిష్యత్తులో తలెత్తకుండా ఎలా నివారించవచ్చు? అనే అంశాలను తెలుసుకోవాలని కోరుకునేవారు. 'ప్రగతి' వేదిక ద్వారా ప్రధాన కార్యదర్శులతో ఆయన నిర్వహించిన వర్చువల్ సమీక్షలు, పీఎం గతిశక్తి ద్వారా సమీకృత డేటా ఆధారిత మౌలిక సదుపాయాల విధానం ఫలితంగా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభించాయి. భూసేకరణ సమస్యలకు పరిష్కారం లభించింది. సమస్యలు సంక్షోభాలుగా మారకముందే ముప్పులను గుర్తించడం సాధ్యమైంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం తోడవడంతో భారత్ ఈ వేగాన్ని మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాల విస్తరణకు మళ్లించింది. గడిచిన సంవత్సరాల్లో బహుశా మరే అధికారికన్నా ఎక్కువగా ఆయనకు ప్రజెంటేషన్లు ఇచ్చే అవకాశం నాకు లభించింది. ప్రతి సందర్భంలోనూ మేధోపరమైన దృష్టి, క్రమశిక్షణ, జిజ్ఞాస కలగలిసిన ఆయన వ్యక్తిత్వాన్ని చూశాను. అంతగా చర్చకు రాని మరో లక్షణాన్ని కూడా గమనించాను. ప్రధానమంత్రి అసాధారణమైన శ్రోత. ఇతరుల మాటలను అడ్డుకోకుండానే సమావేశంపై తన ప్రభావాన్ని చూపగలరు. సమావేశాల్లో ముందుగా ఇతరుల అభిప్రాయాలను పూర్తిగా విని, ఆ తర్వాత తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. భారత్ జీ20 షెర్పాగా ఉన్న సమయంలో ఆయనలో నేను గమనించిన ఈ విధానాన్ని అనుసరించేందుకు ప్రయత్నించాను. సమావేశంలో ఎక్కువ సమయం ఇతరుల మాటలు విని, ఆ తర్వాతే నేను జోక్యం చేసుకునేవాడిని. నీతి ఆయోగ్ నుంచి నేను వైదొలుగుతున్న సమయంలో ప్రధానమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపాను. కానీ ఆయన నాకు భారత జీ20 షెర్పా బాధ్యతలు చేపట్టాలని సూచించారు. దీంతో నా వృత్తి జీవితంలోనే అత్యంత సవాలుతో కూడిన బాధ్యతలోకి అడుగుపెట్టాను. ప్రపంచం తీవ్రంగా విభజితమై ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అధికంగా ఉన్నాయి. ఏకాభిప్రాయం సాధించడం దాదాపు అసాధ్యంగా కనిపించింది. అయినప్పటికీ దేశాలను భారత్ ఒకే వేదికపైకి తీసుకురాగలదనే పట్టుదల ఆయనలో ఉంది. ఆ దృఢ విశ్వాసం నేపథ్యంలోనే న్యూఢిల్లీ లీడర్స్ డిక్లరేషన్ రూపుదిద్దుకుని, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. చర్చలు తీవ్రంగా, తరచూ అలసట కలిగించేలా సాగాయి. ఎన్నో రాత్రులు ఆలస్యంగా పనిచేసినప్పటికీ, అత్యున్నత స్థాయి నుంచి ఆదర్శంగా నిలిచిన సహనం, సంయమనాన్ని అనుసరించేందుకు మేము ప్రయత్నించాం. తీవ్రమైన ఒత్తిడిలో కూడా ప్రధానమంత్రి తన స్వరాన్ని పెంచడం లేదా ప్రశాంతత కోల్పోవడం నేను ఎన్నడూ చూడలేదు. సంయమనమే ఆయన బలం. ఆయన ఆశావాదం, తనతో కలిసి పనిచేసేవారికి మన సూత్రాలపై దృఢంగా నిలిచే ధైర్యాన్ని ఇస్తుంది. ప్రధానమంత్రి మోదీతో కలిసి పనిచేసిన అనుభవం నాయకత్వం పట్ల నా అవగాహనను మౌలికంగా మార్చింది. భారీ స్థాయిలో ఆలోచించడం, ఇతరుల మాటలను లోతుగా వినడం, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉ ఒడటం, పరిస్థితులు నిరుత్సాహకరంగా కనిపించినప్పటికీ పురోగతి సాధ్యమేననే విశ్వాసాన్ని నిలుపుకోవడం ఆయన నుంచి నేర్చుకున్నాను. ఇంకా ఉనికిలోకి రాని దానిని ఊహించగల సాహసం నాయకుడికి ఉండాలని, ఆ ఊహను సాకారం చేసేందుకు ప్రభుత్వ వ్యవస్థ, పరిపాలన, దేశ శక్తిని పూర్తిగా సమీకరించాలని ఆయన నుంచి నేర్చుకున్నాను. ఆయనతో నా అనుబంధం 150 చదరపు కిలోమీటర్ల గురించి జరిగిన ఒక సంభాషణతో మొదలైంది. ఆధునిక భారత్‌లో అత్యంత కీలకమైన కొన్ని పరివర్తనల వరకు ఆ ప్రయాణం కొనసాగింది. ప్రాజెక్టులు, మిషన్లు ఎంతో ముఖ్యమైనవే. అయితే భారత్‌ను సంపూర్ణ అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, అన్నింటికంటే ముఖ్యంగా ప్రతి భారతీయుడి జీవితాన్ని మెరుగుపరచడాన్నే తన ప్రధాన ఆకాంక్షగా పెట్టుకున్న నాయకుడితో కలిసి పనిచేసిన అనుభవమే నా మనసుకు అత్యంత దగ్గరగా నిలిచింది.

**రచయిత: భారత మాజీ జీ20 షెర్పా, నీతి ఆయోగ్ మాజీ సీఈవో, పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం మాజీ కార్యదర్శి.**



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.